క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి



ఇల్లపు తాతారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవన్‌రెడ్డి

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు రాము సోదరుడు, నిర్వాసిత సంఘం నాయకుడు ఇల్లపు తాతారావుకు పలువురు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాతారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో వడ్లపూడిలో బుధవారం సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని, తాతారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ఇల్లపు రాము, కర్రి నాగేశ్వరరావు, బొండా గోవిందరాజులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: జగ్గు జంక్షన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. కణితి రోడ్, గొంతినవానిపాలెం, ప్రశాంతినగర్, మెహర్‌నగర్, మోర్ సూపర్ మార్కెట్ ఏరియా, శ్రామికనగర్, శ్రీనివాసనగర్, కోర్టు కాంప్లెక్స్ ఏరియా, దత్తసాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.


వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం



మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆర్ద్ర నిరూపించారన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలను పరిశీలిస్తే పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధానమైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించుట ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

కూచిపూడిలో సత్తా చాటిన ప్రణవి



కాన్‌క్లేవ్-2024లో విజేతగా నిలిచిన ప్రణవి

దాబాగార్డెన్స్ : నగరానికి చెందిన కళాకారిణి పినిశెట్టి ప్రణవి కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో థాయ్‌లాండ్‌లోని అలెయన్స్ ప్రావిన్స్‌లో జరిగిన కల్చరల్ కాన్‌క్లేవ్-2024లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. ఇప్పటికే ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన ఈ కళాకారిణి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెలవాలని గురువు కూచిపూడి నాగచందన ఆకాంక్షించారు. ఆరేళ్ల వయస్సు నుంచి ప్రణవి కూచిపూడి నృత్యం చేస్తూ మంచి ప్రదర్శనలు ఇచ్చిందంటూ ఆమె తల్లిదండ్రులు పినిశెట్టి రమేష్ బాబు, నవ్యను అభినందించారు.

బిగ్ ఫైట్

- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ
- పోలింగ్ సరళిపై నేతల విశ్లేషణ
- విజయంపై అభ్యర్థుల్లో ఉత్కంఠ
- మెజార్టీపై ఆశలు గల్లంతు



గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



పల్లా శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో గెలుపుపై ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఉత్కంఠ మొదలైంది. ఎన్నికలకు ముందు తమకు వచ్చే మెజార్టీపై లెక్కలు చెప్పిన అభ్యర్థులు, ఇప్పుడు గెలిస్తే చాలనుకునే పరిస్థితి కనిపిస్తోంది. రెండు ప్రధాన పార్టీల మధ్య ఓటింగ్ నువ్వా, నేనా అనే విధంగా పోలవడంతో ఎవరు గెలుస్తారనే విషయాన్ని నిర్దిష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,33,611 మంది కాగా, 2,32,949 మంది ఓట్లు వేశారు. వారిలో పురుషులు 1,14,844 మంది కాగా, మహిళా ఓటర్లు 1,18,105 మంది. 2009లో 68 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 69.83 శాతం నమోదైంది. గత ఎన్నికల కంటే ఇది 1.83 శాతం అధికం.

గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమా

నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, టీడీపీల మధ్యే కొనసాగినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాజిటివ్ ఓటింగ్ తనకే ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్ తరువాత కార్యకర్తలు, పరిశీలకులు ఇచ్చిన నివేదికల ఆధారంగా కూడా మెజార్టీ తనకే ఉందని అంటున్నారు. ఈసారి మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలలో మహిళలకే ప్రాధాన్యత కల్పించారు. దీంతో పాటు అన్ని వర్గాల్లోను జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానులున్నారు. ఆ ఓట్లు తమకే వస్తాయని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో అనేక దీర్ఘకాలిక సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. గాజువాక హౌస్ కమిటీ పరిధిలో ఇళ్లకు సంబంధించి యజమానులకు పూర్తి హక్కులను కల్పిస్తూ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను సైతం అందజేసిన విషయం తెలిసిందే. తన తండ్రి గుడివాడ గురునాథరావు కుటుంబానికి ఈ ప్రాంతంలో ఉన్న గుర్తింపు మరో అదనపు అంశంగా అమర్‌నాథ్ భావిస్తున్నారు.

ఓటింగ్ సరళిపై టీడీపీ నమ్మకం

ఓటింగ్ సరళి తనకే కలిసొచ్చే విధంగా ఉందని టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. పోలింగ్ సరళిపై ఆయన కూడా ఇప్పటికే తమ శ్రేణులతో మాట్లాడి గెలుపుపై ఒక నిర్ధారణకు వచ్చారు. బీజేపీ, జనసేన పొత్తుతో ఓటింగ్ తనకు అనుకూలంగా పడిందని పేర్కొంటున్నారు. యువత ఓటింగ్‌తో పాటు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, ఇతర పథకాల వల్ల కూడా టీడీపీకి మెజార్టీని తెచ్చిపెట్టే ఓటింగ్ పడుతుందని భావిస్తున్నారు.

● కాంగ్రెస్ పార్టీ, సీపీఐ సహా వివిధ ఇతర పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి నుంచి బరిలోకి దిగిన సీపీఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు కూడా తమకు మంచి ఓటింగ్ లభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాము వెయ్యి ఓట్లకు పైగానే తెచ్చుకుంటామని స్వతంత్ర అభ్యర్థులు చెబుతున్నారు. తమకు కూడా ఇతరులకంటే తీసిపోని విధంగా ఓట్లు వస్తాయని మిగిలిన పార్టీలకు చెందిన అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం మెజార్టీపై ఆశలు వదులుకున్నారు. ఓటరు మాత్రం ఈ పరిస్థితిని ఆసక్తిగా పరిశీలిస్తున్నాడు.

కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణకు భూమిపూజ



ల్యాబ్ ఆధునికీకరణ పనులకు భూమి పూజ చేస్తున్న కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణ పనులకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధికారులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.34లక్షలతో ఈ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు పూర్తి చేసిన వెంటనే 25 కంప్యూటర్లు, టేబుల్స్, కుర్చీలను అందజేయనున్నామని వివరించారు. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థినికి అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ బాబు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఎంపీసీలో 88 సీట్లు, ఆర్ట్స్‌లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల వంతున ఉన్నాయన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు బైపీసీ గ్రూపుపై ఆసక్తి కనబరచడంతో ఈ ఏడాది నుంచి ఆ గ్రూపు ఏర్పాటుకు అధికారులను అనుమతి కోరామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే బైపీసీ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, ఎం.మస్తాన్ రెడ్డి, లెక్చరర్లు డి.దివ్య, రత్నం, సూర్య శంకరరావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేడు ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి



పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి వీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరి నగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కల్యాణ వైభోగం



పాల్గొన్న ఉభయదాతలు




కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

22, 23 తేదీల్లో జీవ వైవిధ్య దినోత్సవం

ఏయూ క్యాంపస్: ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం వేదికగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ కార్యదర్శి డాక్టర్ బి.బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 22న బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు. 23న కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, 23న ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంతో జీవ వైవిధ్యం ముడిపడి ఉందన్నారు ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా చేసే కార్యక్రమాలకు తాము సహకారం అందిస్తామన్నారు. సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా వర్సిటీలో జీవవైవిధ్యతను పరిరక్షించాలని సూచించారు.

కుక్కలతో బెంబేలు



మిందిలో రోడ్డుపై గుంపులుగా కుక్కలు

అక్కిరెడ్డిపాలెం: వీధి కుక్కలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో బయటకు రావాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. విధులు ముగించుకుని రాత్రివేళల్లో ఇంటికి వచ్చేవారికి కుక్కలు చుక్కలు చూపిస్తున్నాయి. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో కుక్కల బెడదతో స్థానికులకు కంటిపై కునుకు కరువైంది. ప్రతీ వీధిలోను 10 నుంచి 20 కుక్కలు గుంపులుగా తిరుగుతుండడంతో భయపడిపోతున్నారు. రాత్రివేళల్లో కుక్కల అరుపులు, దాడులతో ప్రశాంతంగా నిద్ర కూడా పట్టడంలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కుక్కల బెడద తప్పించాలని కోరుతున్నారు.

19న కుంతీ మాధవ స్వామి చందనోత్సవం



కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో స్వామి చందనోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఈవో నానాజీ బాబు తెలిపారు. 18న రాత్రి పది గంటలకు కుంతీ మాధవ స్వామి విగ్రహాన్ని చందనంతో అలంకరిస్తారు. 19న ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు.

భానుడి కర్ఫ్యూ

- మండుతున్న ఎండలు
- కానరాని జన సంచారం
- రోడ్లన్నీ నిర్మానుష్యం



నిర్మానుష్యంగా ఉన్న నడుపూరు రోడ్డు

భానుడు భగభగ మంటున్నాడు.. ఉదయం 8 గంటల నుంచే మొదలవుతున్న వేడి సాయంత్రం 6 గంటలవుతున్నా తగ్గకపోవడంతో జనం అల్లాడిపోతున్నారు. రోడ్ల పైకి రావాలంటేనే హడలిపోతున్నారు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ బుధవారం జన సంచారం లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎండ వేడికి తట్టుకోలేక జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. వైద్యులు కూడా ఇదే సూచిస్తుండడంతో యువకులు కూడా అత్యవసరమైతేనే బయటకు వస్తున్నారు. ఇళ్లలో ఉండే చిన్న పిల్లలు, వృద్ధులు సైతం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చల్లని నీరు, కొబ్బరి నీరు, చెరకు రసాలు, తాటిముంజెలు, జ్యూస్‌లతో వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు. – పెదగంట్యాడ



జన సంచారం లేని సీతానగరం కూడలి



నిత్యం రద్దీగా ఉండే సిద్ధేశ్వరం రోడ్డు ఖాళీగా ఇలా..



వెంపళ్లనగర్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి..

'బీజేపీ వచ్చాకే ప్రభుత్వరంగ సంస్థలు నాశనం'

అగనంపూడి: బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దాదాపు అన్ని ప్రభుత్వరంగ సంస్థలు సర్వనాశనం అయ్యాయని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1189వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాకముందు బ్యాంకులు డిపాజిట్ల కోసం విశాఖ ఉక్కు ముందు మోకరిల్లేవని, కాని నేడు ఆయా సంస్థలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయంటే దానికి కారణం కేవలం బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. దేశానికి వెన్నుదన్నుగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు నేడు దయనీయ స్థితికి వెళ్లాయంటే కారణం కేవలం కేంద్ర ప్రభుత్వ తీరే అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మైదానానికి మహర్దశ

- రూ. 2 కోట్లతో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



అభివృద్ధి చేసిన ఇందిరా ప్రియదర్శిని స్టేడియం



కొత్తగా నిర్మిస్తున్న పెవిలియన్ బాక్స్

జగదాంబ : గతంలో ఎన్నో అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిన ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఆ తర్వాతి కాలంలో శిథిలావస్థకు చేరుకుంది. సరైన నిర్వహణ లేక పాడుబడి.. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారికి, మందుబాబులకు నిలయంగా మారింది. దీంతో స్థానిక క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. అలా చాలా కాలం స్టేడియం శిథిలంగానే ఉండిపోయింది. అయితే తాజాగా జీవీఎంసీ కమిషనర్ చొరవతో స్టేడియం అభివృద్ధి బాట పట్టింది.

రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు..

సుమారు రూ. 2 కోట్ల నిధులతో స్టేడియం అభివృద్ధికి పనులు చేపట్టారు. ప్రధాన ద్వారాలు, రెయిన్‌బో గ్యాలరీ, పెవిలియన్ బాక్స్, స్కోరు బోర్డు, రహదారులు, కాలువలు, స్టేడియం చుట్టు ఆహ్లాదం పంచే పూలమొక్కల ఏర్పాటు, విద్యుత్ వెలుగులు, చిన్నారుల కోసం ప్లే ఏరియా, యువకులు, మహిళల కోసం ఓపెన్ జిమ్, ఇండోర్ గేమ్స్ ఏరియా, షటిల్, బాస్కెట్‌బాల్, స్నూకర్, బాక్సింగ్ రింగ్, గ్యాలరీ చుట్టు ఇనుప ఫెన్సింగ్, మరుగుదొడ్లు, ల్యాండ్ స్కేపింగ్, మినీయేచర్స్, కూర్చునేందుకు బల్లలు, వంద కార్లు పార్కింగ్ చేసుకునేందుకు సరిపడే స్థలం వంటి సదుపాయాలు కల్పించి స్టేడియం పూర్వవైభవానికి కృషి చేస్తున్నారు.

మార్గం .. వర్ణశోభితం



డెడికేషన్ పార్కు సమీపంలో పూల మొక్కలు



స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి రహదారిలో ..



స్టీల్‌ప్లాంట్ రహదారి పక్కన టెకోమా చెట్లు

రహదారులు వర్ణశోభితమై దర్శనమిస్తున్నాయి. మార్గానికి ఇరువైపులా వివిధ వర్ణాల పుష్పాలు కళకళలాడుతూ కనువిందు చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉక్కు యాజమాన్యం, ఉద్యోగులు స్టీల్‌ప్లాంట్‌లో పలురకాల పూలమొక్కలు నాటారు. అవి పెరిగి పెద్దవై, ప్రకృతికి పచ్చదనాన్ని అద్దడంతో పాటు రహదారులకు కొత్తందాన్ని తెచ్చాయి. ముఖ్యంగా వేసవి కాలంలో పెరిగే టెకోమా వంటి పూల చెట్లు స్టీల్‌ప్లాంట్ అందాలను ద్విగుణీకృతం చేస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, ప్రయాణికులు ప్రకృతి రమణీయతకు ముగ్ధులవుతున్నారు. మండే ఎండల్లో చల్లని గాలిని ఆస్వాదిస్తూ ప్రయాణిస్తున్నారు. – ఉక్కునగరం

ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలి



ప్రసంగిస్తున్న సుందర్ గోపాల్ ప్రభు

కొమ్మాది : నేటి తరం యువత ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని సుందర్ గోపాల్ ప్రభు సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు నిర్వహించిన ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు మనిషిని కష్ట సుఖాల్లో నిలబెడతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులకు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత ప్రవచనాలు ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహించారు. సమావేశాల్లో స్వామీజీ పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధేశ్యామ్ ప్రభు, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు పాల్గొన్నారు.